క్లుప్తంగా

మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

యడ్లపాడు: మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా కేంద్రం రూపొందించిన స్వస్థ్ నారి సశక్తి అభియాన్ పరివార్ గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి భరద్వాజ చెప్పారు. సొలస గ్రామంలోని రంగనాయక ఆలయ ప్రాంగణంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్, రక్తపోటు, రక్తహీనత (హీమోగ్లోబిన్), షుగర్ పరీక్షలు నిర్వహించారు. 69 మంది మహిళలకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన వైద్య సేవలు అందించి, వైద్యశాఖకు చెందిన ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో ఆన్‌లైన్ చేశారు. గర్భిణులకు టీటీ వ్యాక్సిన్‌తో పాటు ఐరన్, కాల్షియం మాత్రలు పంపిణీ చేసి, వారికి ఆరోగ్య సలహాలు, కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించారు. వైయో వందన కార్డులను ఆన్‌లైన్ చేసి, అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వినుకొండ బస్టాండ్ కిటకిట




వినుకొండ: దసరా సెలవులు రావడంతో వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులతో వినుకొండ ఆర్టీసీ బస్టాండ్ గురువారం కిక్కిరిసిపోయింది. దేవీ నవరాత్రుల కోసం వివిధ ప్రాంతాలకు మహిళలు పెద్దసంఖ్యలో తరలివెళ్తుండటం, విద్యార్థులు సెలవుల కావడంతో ఏ బస్సు చూసినా పెద్ద సంఖ్యలో మహిళలతో నిండిపోయింది. ఒక్కో దాంట్లో 100 నుంచి 150 మంది ప్రయాణికులు ఎక్కడంతో ఓవర్ లోడ్‌తో బస్సులు వెళ్లాయి. కొన్ని ప్రాంతాలకు బస్సులు రావడం ఆలస్యం కావడంతో గంటల తరబడి బస్టాండ్ ఆవరణలో పెద్దసంఖ్యలో ప్రయాణికులు నిలబడ్డారు.

ఈ-పంట నమోదు పూర్తి చేయాలి



నరసరావుపేట రూరల్: ఈ – పంట నమోదును త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు తెలిపారు. యల్లమంద గ్రామ రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. ఎరువుల లభ్యత, పంటల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డ్రోన్ పనితీరును పరిశీలించారు. డ్రోన్ వినియోగంపై ట్రైనర్‌తో ముఖాముఖి మాట్లాడి ప్రత్యక్ష పరిశీలన జరిపారు. అనంతరం రావిపాడు గ్రామంలోని యూనియన్ బ్యాంకులో అధికారులతో సమావేశమయ్యారు. కౌలు రైతులకు, జాయింట్ లైబిలిటీ గ్రూపులకు పెట్టుబడి సాయం కింద రుణాలు మంజూరు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు బ్యాంక్ అధికారులను కోరారు. అర్హత ఉన్న ప్రతి కౌలు రైతుకు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని బ్యాంకు మేనేజరు సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ శాంతి, వ్యవసాయ విస్తరణ అధికారి బ్రహ్మయ్య, వీఏఏ అంజలి పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలను ప్రోత్సహించాలి



చిలకలూరిపేట: చేనేత వస్త్రాలను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పట్టణంలోని కృష్ణమహల్ సెంటర్‌లో ఉన్న సింగు మినీ ఫంక్షన్ హాలులో బీజేపీ ఆధ్వర్యంలో చేనేత వస్త్ర ప్రదర్శన గురువారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ విదేశీ వస్తువులు వద్దు, స్వదేశీ వస్తువులే ముద్దు అనే నినాదంతో చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభించటం అభినందనీయమన్నారు. బీజేపీ అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాశ్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాత్యాయనీ నమో నమః



శావల్యాపురంలో కాత్యాయనీగా..



విప్పర్లలో శ్రీ కాత్యాయనీ దేవి అలంకరణలో..



నూజెండ్లలో గాయత్రీ అలంకరణలో అమ్మవారు



సాతులూరు నవరాత్రి ఉత్సవాల్లో చిన్నారుల భరతనాట్య ప్రదర్శన

దేవీశరన్నవ రాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం నాలుగో రోజు అమ్మవారు శ్రీకాత్యాయని దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. ఆయాచోట్ల సువాసినులచే కుంకుమార్చనలు, సాయంత్రం వేళ దంపతులతో అమ్మవారి సహస్రనామ పూజలు, విశేష హారతి మంత్రపుష్పం, శక్తి హోమాలను వైభవంగా నిర్వహించారు.


– నూజెండ్ల/ శావల్యాపురం/వినుకొండ/రొంపిచర్ల/నరసరావుపేట ఈస్ట్/నాదెండ్ల/చిలకలూరిపేట/యడ్లపాడు



వినుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అన్నపూర్ణ అలంకరణ



నరసరావుపేటలో కాత్యాయనీ అలంకరణలో



వైష్ణవి అలంకరణలో శ్రీ కన్యకా పరమేశ్వరీ



గణపవరం గండిపోచమ్మ ఆలయంలో కాత్యాయనీగా..



చిలకలూరిపేటలో శ్రీ రాజరాజేశ్వరీ అలంకారం



లింగారావుపాలెం శివాలయంలో అన్నపూర్ణాదేవిగా..

అధ్వాన పారిశుద్ధ్యంతో అవస్థలు

బొల్లాపల్లి: గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం పడకేసింది. పంచాయతీ పాలన యంత్రాంగం, ఆరోగ్య సిబ్బంది సేవలు అటకెక్కాయి. అంటువ్యాధుల బారిన పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని గండిగనుమల గ్రామంలో పారిశుద్ధ్యం క్షీణించి, వీధులన్నీ మురికి కుపాలుగా తయారయ్యాయి. గ్రామంలోని ప్రధాన కూడలి, వాటర్ ట్యాంక్ వద్ద మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లుతుంది. పరిసరాల పరిశుభ్రత లోపభూయిష్టంగా తయారైంది. సైడ్ కాలువల పూడికి తీయక, మురుగునీరు పారుదల లోపించి అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయని, వీధులన్నీ మురుగు నిలిచి బురద గుంటలను తలపిస్తున్నాయని, దుర్గంధ భరితంగా ఉండటంతో అనారోగ్యం బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్త, మురుగు దోమలకు ఆవాసాలుగా మారాయి. దీంతో దోమలు వ్యాప్తి చెంది జ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పాలన యంత్రాంగం పారిశుద్ధ్యం మెరుగుపరిచిన దాఖలాలు లేవు.



గండిగనుమల వీధుల్లో మురుగు



పేరుకుపోయిన చెత్త

పరిసరాల పరిశుభ్రతపై దృష్టిసారించపోవటంతో దోమలు వృద్ధి చెంది, అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని, పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామాల్లో పోషణ మాసోత్సవాలు

యడ్లపాడు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని యడ్లపాడు ఎంపీడీఓ వి.హేమలతా దేవి తెలిపారు. నాదెండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం యడ్లపాడులో నిర్వహించిన మండలస్థాయి పోషణ మాసోత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడుతూ.. మంచి ఆరోగ్యం కోసం రసాయన ఎరువులు లేని సేంద్రీయ ఆహారాన్ని తీసుకోవడం ఉత్తమమని, ప్రతి ఒక్కరు తమ ఇంటి పెరట్లో చిన్నపాటి పెరటి తోటలు పెంచుకోవాలని సూచించారు. సీడీపీఓ జి.శాంతకుమారి మాట్లాడుతూ.. పిల్లల ఆరోగ్యం, ఎదుగుదలకు పోషకాహారం ఎంత ముఖ్యమో వివరించారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసనలు నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు పోషకాహారంతో కూడిన వంటల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ వెంకయ్య, ప్రథమ్ జిల్లా కో–ఆర్డినేటర్ ఎం.వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి శశికళ, ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్స్ కె.వెంకటరమణ, ఆర్.సామ్రాజ్యం, వి.అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, తల్లులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



యడ్లపాడులో గర్భిణులకు సీమంతాలు నిర్వహించిన సీడీపీఓ జి.శాంతకుమారి

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

చిలకలూరిపేటటౌన్: విద్యార్థులు ఉద్యోగాల అన్వేషణ కాదు.. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పల్నాడు జిల్లా ఇండస్ట్రీస్ సెంటర్ ఆఫీసర్ ఎం.నవీన్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని డీఆర్ఎన్ఎస్‌సీవీఎస్ కళాశాలలో గురువారం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవేర్‌నెస్ ప్రోగ్రాం జరిగింది. విశాఖపట్నం అసిస్టెంట్ డైరెక్టర్ డి.వీరయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసి కొత్త వ్యాపారాలు ప్రారంభించాలని సూచించారు. స్వయం ఉపాధి, పరిశ్రమలు స్థాపించడానికి ప్రభుత్వం అందిస్తున్న ఎంఎస్ఎంఈ, డీఐసీ, రాంప్, ముద్ర వంటి పథకాల గురించి వివరించారు. ఆయా పథకాలను సద్వినియోగం చేసుకునే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైఎస్సార్ నూలుమిల్లు ఎండీ ఎం.శ్రీనివాసులురెడ్డి విద్యార్థులు పాఠశాల దశ నుంచే వ్యాపారాలపై అవగాహన పెంచుకోవాల్సిన ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.ఉదయప్రకాష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శావల్యాపురంలో వైద్యశిబిరం

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం అంబేడ్కర్ విగ్రహం ప్రధాన కూడలి మార్గంలో బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు గట్టుపల్లి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన మహోన్నత వ్యక్తులను గుర్తు చేసుకోవటం మంచి శుభపరిణామన్నారు. అనంతరం వైద్య శిబిరంలో 50 మంది రోగులకు బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రావిపూడి రమ్య, ఆరోగ్య కార్యకర్త లింగాల శ్రీలలిత, తదితరులు పాల్గొన్నారు.

‘ఎస్ఎస్ఎన్’లో ఫ్రెషర్స్ డే వేడుకలు

నరసరావుపేట ఈస్ట్: పేద, మధ్యతరగతి విద్యార్థుల అభ్యున్నతే ధ్యేయంగా శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్థాపించబడిందని కళాశాల పాలకవర్గ అధ్యక్ష్య, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త స్పష్టం చేసారు. కళాశాల ఆడిటోరియంలో గురువారం డిగ్రీ విద్యార్థుల ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా కళాశాలలో అడుగిడిన విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలనతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. ఈసందర్భంగా విద్య, క్రీడా, సాంస్కృతిక రంగాలలో ప్రతిభ గల విద్యార్థులకు బహుమతులు అందించారు. కళాశాల జాయింట్ సెక్రటరీ ఊటుకూరి వెంకటఅప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు, కమిటీ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

క్లాప్ మిత్రల సేవలు వెలకట్టలేనివి



క్లాప్‌మిత్రలను సన్మానిస్తున్న ఎంపీడీఓ ఉమాదేవి

నూజెండ్ల: గ్రామాలు పరిశుభ్రంగా ఉంచటంలో క్లాప్ మిత్రలు (పారిశుద్ధ్య కార్మికులు) ప్రధాన పాత్ర పోషిస్తున్నారని ఎంపీడీఓ ఉమాదేవి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నూజెండ్ల, ఉప్పలపాడు, జడ్డావారిపాలెం, చెరుకుంపాలెం, గ్రామ సచివాలయంల్లో గురువారం క్లాప్‌మిత్రలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణే కాకుండా కార్మికులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం గ్రామాల సర్పంచ్‌లతో కలిసి శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణ, సొసైటీ పర్సన్ బచ్చు అంజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రవీంద్రబాబు, రామకృష్ణ, లాలు, స్వచ్ఛ భారత్ మండల కో–ఆర్డినేటర్ సుబ్బరామయ్య, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య మెరుగులో భాగస్వాములు కావాలి

చిలకలూరిపేట: పారిశుద్ధ్య మెరుగులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీలో ఉన్న మున్సిపల్ పార్కులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఏక్‌దిన్ ఏక్ ఘంట ఏక్ సాత్ పేరుతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీని ఉద్దేశం రోజులో ఒక గంట పారిశుద్ధ్యం కోసం కేటాయించాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తుందన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులతో కలసి పార్కును ఊడ్చి, గ్రాస్ కట్టర్‌తో గడ్డిని తొలగించారు. కమిషనర్ పి.శ్రీహరిబాబు, డీఈఈ షేక్ అబ్దుల్ రహీం, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రమణారావు, సునీత, కౌన్సిలర్లు సిబ్బంది పాల్గొన్నారు.

శావల్యాపురం: స్వచ్ఛ భారత్‌పై ప్రజల్లో చైతన్యం పెంపొదించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో పి.సుగుణ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో మండల స్థాయి అధికారుల సారథ్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచులు బీర్నేడి రత్నగిరి, మద్దినేని ఆంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



యడ్లపాడు: 16వ నంబర్ జాతీయ ఎక్స్‌ప్రెస్ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. హైవే భద్రతా సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంకు చెందిన కోరప్రాటి కోటేశ్వరరావు చిలకలూరిపేట నుంచి తన స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వినుకొండ – హైదరాబాద్ మార్గంలో వేగంగా వెళ్తున్న కారు మండలంలోని వంకాయలపాడు వద్దకు రాగానే వెనుక టైరు ఒక్కసారిగా పగిలిపోయింది. దీంతో వేగంలో ఉన్న కారు అదుపుతప్పి కారు ముందు వెళ్తున్న కోటేశ్వరరావు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ పాక్షికంగా దెబ్బతినగా, కోటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే భద్రతా సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన కోటేశ్వరరావును కోండ్రుపాడులోని కేఎంసీ బోధనాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు పోలీసులు విచారణలో తెలియాల్సి ఉంది.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

నరసరావుపేట: పండిట్ దీనదయాళ్ జయంతి సందర్భంగా గురువారం మున్సిపల్ అధికారులు ఏక్ దిన్ ఏక్ ఘంట్ ఏక సాత్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మల్లమ్మసెంటర్ నుంచి సత్తెనపల్లిరోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు రోడ్డు శుభ్రత కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావుతో కలిసి చీపురుపట్టి రోడ్లను శుభ్రం చేశారు. ఎమ్మెల్యే చదలవాడ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని, అలాగనే ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. డీఈ రఫీక్, ఏఈ జ్యోతి, శానిటరీ ఇనస్పెక్టర్లు, పర్యావరణ కార్యదర్శులు, శానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు. చిలకలూరిపేట రోడ్డు నుంచి వినుకొండ రోడ్డు హైవే, వల్లభ ఫీడ్స్ వరకు రోడ్డుకు ఇరువైపులా కేసానుపల్లి పంచాయతీ వారు వేసిన చెత్తను మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు స్వీయ పర్యవేక్షణలో శానిటరీ అధికారులు, సిబ్బంది పొక్లెయిన్, ట్రాక్టర్ల సహాయంతో తొలగించారు.

కేబీఆర్ పార్కులో...

నరసరావుపేట: పల్నాడు రోడ్డులోని కాసు బ్రహ్మనందరెడ్డి మున్సిపల్ పార్కులో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజినల్ ఆఫీసు అధికారులు, పలు బ్యాంకుల అధికారులు గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పార్కులో శ్రమదానం చేసి చెత్తా చెదారాన్ని ఎత్తివేసి శుభ్రం చేశారు. బ్యాంకు రీజినల్ హెడ్ టి.మాధురి మాట్లాడుతూ స్వచ్ఛతా హీ కార్యక్రమం ప్రతి ఇంట్లో నుంచి ప్రారంభం కావాలని కోరారు. డిప్యూటీ ఆర్‌హెచ్ సీహెచ్ మురళీమోహన్, డిప్యూటీ ఆర్‌హెచ్ జి.సోమేశ్వరరావు, ఇతర ఎగ్జిక్యూటీవ్ వర్టికల్ హెడ్‌లు, స్థానిక శాఖల సిబ్బంది పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.



కేబీఆర్ పార్కులో శ్రమదానం చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

బాధితుడిని ఆదుకోవాలని డిమాండ్

పిడుగురాళ్ల: విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నష్టపోయిన వ్యక్తిని ఆదుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కారంపూడి మండలం పెద కొదమగుండ్ల గ్రామంలో సాగర్‌బాబును బలవంతంగా స్తంభంపైకి ఎక్కించడంతో విద్యుదాఘాతానికి గురై కింద పడి కాళ్లు, చేతులు కోల్పోయాడని చెప్పారు. విద్యుత్ శాఖ లైన్‌మెన్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ లైన్‌మెన్ పరబ్రహ్మంచారి, ఏఈలు దీనికి కారణమని ఆరోపించారు. నేటికీ బాధితుడికి న్యాయం జరగలేదని వాపోయారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పేదలకు అన్నదానం

మాచర్ల: స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యాన్నదానం కొనసాగుతున్నట్లు ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి గురువారం తెలిపారు. ప్రతిరోజు రద్దీ ప్రాంతాల్లో పేదలకు మూడు పూటలా ఆహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మూగజీవులకు కూడా ఆహారం పెడుతున్నట్లు చెప్పారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో సేవలు చేస్తున్నట్లు వివరించారు. దాతలు సహాయ, సహకారాలు అందించాలని ఆయన కోరారు.

దమ్ము చక్రం.. రహదారిద్ర్యం

దమ్ము చక్రాల తాకిడికి రూ.కోట్లు ఖర్చు చేసి వేసిన రోడ్లు ఛిద్రమవుతున్నాయి. ఇటీవల వేసిన రోడ్లు సైతం మూన్నాళ్ల ముచ్చటగా మారి రూపురేఖలు కోల్పోతున్నాయి. మండల కేంద్రమైన నూజెండ్ల పమిడిపాడు బ్రాంచ్ కాలువ క్రింద తిమ్మాపురం, రవ్వవరం, రెడ్డిపాలెం, నూజెండ్ల, అప్పాపురం తదితర గ్రామాల్లో వ్యవసాయ సీజన్ మొదలైంది. కాలువ కింద భూములు కావటంతో వరి ఎక్కువగా సాగు చేపడతారు. ప్రారంభంలో దమ్ము చక్రాలతో సాగు చేయాల్సి ఉండటంతో రోడ్లపై వాటి తాకిడి ఎక్కువైంది. ఫలితంగా రహదారులు ధ్వంసం అవుతున్నాయి. అవగాహన కల్పించి అడ్డుకోవాల్సిన అధికారులు మిన్నకుంటుండడంతో వీటి తాకిడి ఎక్కువైంది. ఇప్పటికైనా అధికారులు జరిమానాలు కఠినంగా వసూలు చేస్తే సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

– నూజెండ్ల



రోడ్లపై తిరుగుతున్న దమ్ము చక్రాల ట్రాక్టర్